డయాలసిస్ రోగులకు మంచి రోజులు

- త్వరలో అందుబాటులోకి డయాలసిస్ సేవలు
- కిడ్నీ డయాలసిస్ సెంటర్ ఏర్పాటు పనులు పూర్తి
- ఈ నెలలోనే ప్రారంభోత్సవానికి సన్నాహాలు
- నెరవేరిన సీఎం జగన్ హామీ


అవనిగడ్డలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న డయాలసిస్ సెంటర్


డయాలసిస్ సెంటర్‌కి వచ్చిన పరికరాలు

అవనిగడ్డ: దూర ప్రాంతాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్న దివిసీమ రోగులకు మంచి రోజులు రానున్నాయి. అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కిడ్నీ డయాలసిస్ సెంటర్ పనులు పూర్తయ్యాయి. ఈ నెలలోనే ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అపోలో సౌజన్యంతో అవనిగడ్డలో కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంపై డయాలసిస్ రోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి

గత ఏడాది అక్టోబర్ 20న అవనిగడ్డలో జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభలో స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కోరిక మేరకు డయాలసిస్ సెంటర్‌ను ప్రకటించారు. సెంటర్ ఏర్పాటు కోసం రెండు చోట్ల స్థల పరిశీలన జరగడంతో కొంత ఆలస్యమైంది. అపోలో సౌజన్యంతో స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. వీటికి సంబంధించి పరికరాలు రాగా గత వారం రోజుల నుంచి వాటిని అమర్చే పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తి కాగా ఈ నెలలోనే ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నారు.

డయాలసిస్ రోగులకు ఎంతో ప్రయోజనం..

అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 56 మంది డయాలసిస్ పేషెంట్స్ ఉన్నారు. వీరిలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా పలు ప్రాంతాల్లో డయాలసిస్ చేయించుకుంటున్నవారు 33 మంది ఉన్నారు. వీరంతా మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, హైదరాబాద్‌లో డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఇందుకోసం చాలా ఇబ్బందులు పడుతున్నారు. డయాలసిస్‌కు వెళ్లేందుకు రోగికి మరో వ్యక్తి అవసరం అవుతారు. వెళ్లిన రోజు బిజీగా ఉంటే మరోసారి వెళ్లాల్సి ఉంటుంది. కొంత మంది అయితే విజయవాడ, గుంటూరు, హైదరాబాద్‌లో ఇళ్లను అద్దెకు తీసుకుని అక్కడే ఉంటున్నారు. అవనిగడ్డలో డయాలసిస్ సెంటర్ ప్రారంభమైతే వీరంతా ఇక్కడికే వచ్చి డయాలసిస్ సేవలు పొందుతారు. డయాలసిస్ సెంటర్‌ను మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, అందుకు కృషి చేసిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు దివిసీమ ప్రజలు కృతజ్ఞత తెలుపుతున్నారు.



సీఎం జగన్‌కు రుణపడి ఉంటారు

అడిగిన వెంటనే డయాలసిస్ సెంటర్‌ను మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజలు రుణపడి ఉంటారు. ఈ సెంటర్ వల్ల దూర ప్రాంతాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్న వారి ఇబ్బందులన్నీ తొలగిపోతాయి. ఈ నెలలోనే డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– సింహాద్రి రమేష్‌బాబు, అవనిగడ్డ ఎమ్మెల్యే

అద్దెకు ఉంటూ డయాలసిస్ చేయించుకుంటున్నా

నాలుగు నెలల కిందట కిడ్నీ సంబంధిత సమస్య బయట పడింది. రోజు విడిచి రోజు డయాలసిస్ చేయించుకోవాల్సి వస్తోంది. అవనిగడ్డ నుంచి వెళ్లి రావడానికి ఇబ్బంది వల్ల విజయవాడలోనే ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నాం. అవనిగడ్డలో డయాలసిస్ సెంటర్ ప్రారంభమైతే అక్కడికే వచ్చేస్తాం. ఇది మాకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

–కె. ప్రేమ్‌సాయి, అవనిగడ్డ

ఇబ్బందులు తొలగిపోతాయి

గుంటూరు వెళ్లి డయాలసిస్ తీసుకుంటున్నా. అక్కడకు వెళ్లాలంటే మరొకరు తోడు లేకుండా కుదరదు. బిజీగా ఉంటే ఇంకో రోజు వెళ్లాల్సి వస్తోంది. నాతో వచ్చే వ్యక్తి అన్ని పనులు మానుకోవాలి. ఇద్దరు అంత దూరం వెళ్లేందుకు వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తోంది. అవనిగడ్డలో సెంటర్ ప్రారంభమైతే మా ఇబ్బందులన్నీ తొలగిపోతాయి.

డి. లత, అవనిగడ్డ

జాబ్‌మేళాకు విశేష స్పందన

ఉద్యోగాలకు 102 మంది ఎంపిక


జాబ్‌మేళాలో మాట్లాడుతున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల వద్ద నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 13 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 326 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. 102 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. 162 మంది తరువాతి ఇంటర్వ్యూలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి నిరుద్యోగులు పెద్దఎత్తున తరలివచ్చారు. ముఖ్యఅతిథి వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తున్నారని చెప్పారు. దీనిలో భాగంగానే నిరుద్యోగ యువతకు పలు కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని చెప్పారు. మచిలీపట్నంలో 13 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తుండటం అభినందనీయమన్నారు. డిప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మీ, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ విక్టర్‌బాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యదర్శి పల్లపోతు సుబ్రహ్మణ్యం, ఎంజీఎస్ఎఫ్ సుదర్శన్, ఏపీఎస్ఎస్‌డీసీ సంస్థ అదనపు నైపుణ్యాభివృద్ధి కార్యనిర్వాహకులు బీవీ సందీప్, జిల్లా నియామక కార్యనిర్వాహకులు తుర్లపాటి మధు, మచిలీపట్నం స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ కె. దిలీప్, కళాశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వామివారి సన్నిధిలో ఏడీజీ అతుల్‌సింగ్



మోపిదేవి: అడిషనల్ డీజీ అతుల్‌సింగ్ కుటుంబ సమేతంగా స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు వెంకటేశ్వరరావు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు స్వామి వారి చిత్రపటం, లడ్డూప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. చల్లపల్లి సీఐ భీమేశ్వర రవికుమార్, ఎస్ఐ సీహెచ్ పద్మ, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

170 మందికి వైద్య పరీక్షలు



మచిలీపట్నంటౌన్: సమాజంలోని ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ గోపాలం శివన్నారాయణ అన్నారు. డీబీఆర్ ఫౌండేషన్, ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బుట్టాయిపేటలోని జ్యోతిరావు పూలే కేంద్రంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 170 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ శివన్నారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని కలిగి పేదలకు సాయం చేసే గుణాన్ని అలవరుచుకోవాలన్నారు. అప్పుడే పేదలకు మేలు జరుగుతుందన్నారు. ఈ విధంగా తాను సంవత్సరం నుంచి మచిలీపట్నంలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నానని తెలిపారు. వైద్యులు డీఆర్‌కే ప్రసాద్, పి. సురేష్ చంద్రారెడ్డి, కుప్పా రామశాస్త్రి వైద్య సేవలు అందించారు. అనంతరం రోగులకు అవసరమైన మందులను రూ. 200లకు అందజేశారు.

వృద్ధురాలికి ఆర్థిక సాయం



మెరకనపల్లి(మోపిదేవి): మండల పరిధి మెరకనపల్లిలో వృద్ధురాలు పామర్తి జాన్సీకి చైల్డ్ హుడ్ గ్రూప్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అండగా ఉండే ఆమె కుమారుడు ప్రసాద్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందడంతో ఆధారం కోల్పోయింది. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం వృద్ధురాలిని కలిసి ఆర్థిక సాయం అందించారు. గ్రూపు అధ్యక్షుడు మత్తి శ్రీనివాసరావు, లీలా కృష్ణ, మిత్ర బృందం పాల్గొన్నారు.

బౌద్ధక్షేత్రం చరిత్ర ఘనమైనది



ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాలలోని బౌద్ధ క్షేత్రం చరిత్ర ఎంతో ఘనమైనదని ప్రముఖ యాత్రికుడు, రచయిత డాక్టర్ మాచవరపు ఆదినారాయణ అన్నారు. ఆదివారం ఆయన ఘంటసాలలోని బౌద్ధ క్షేత్రం, మ్యూజియం, జలదీశ్వరాలయాన్ని సందర్శించి మాట్లాడారు. ఘంటసాలలో 2వ శతాబ్దంలోని బౌద్ధ స్థూపాన్ని సందర్శించడం వల్ల ఎన్నో చారిత్రక అంశాలు తెలిశాయన్నారు. ఇలాంటి చారిత్రక ప్రదేశాలను ప్రతి ఒక్కరూ సందర్శించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఆదినారాయణను మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ జీవీ రామకృష్ణ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వేమూరి రాజేష్, స్థానికులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెండ్‌షిప్ డే

గుడివాడ టౌన్: తారక రామా వాకర్స్‌క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో ఫ్రెండ్‌షిప్ డే ఆదివారం నిర్వహించారు. శ్రీనిత్య ఆయుర్వేద వైద్యశాల ప్రాంగణంలో వేడుకలు నిర్వహించారు. స్నేహం చాలా గొప్పదని కుల, మత, ప్రాంత వ్యత్యాసాలు లేకుండా నిస్వార్థ సేవలందించేది ఒక్క స్నేహమేనని వక్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో మెరుగుమాల బ్రహ్మయ్య, బి.రాధాకృష్ణ, దండమూడి సీతారామస్వామి, కొల్లిపర సాయి సుబ్రహ్మణ్యం, డి.శ్యాంబాబు, చిన్నం గంగాధరరావు, సామి రామ్మోహన్, పి.నాంచారయ్య, బి. రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు కుట్ర

- పక్కా ప్లాన్‌తోనే మారణాయుధాలతో దాడులు
- పుంగనూరు ఘటనపై వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆగ్రహం

కోడూరు: రాజకీయ లబ్ధి కోసం ప్రశాంతంగా ఉండే ప్రజల మధ్య విభేదాలు సృష్టించి రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చాలన్నదే ప్రతిపక్ష నేత చంద్రబాబు కుట్ర అని జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి నారాయణరావు విమర్శించారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో టీడీపీ నాయకులు సృష్టించిన విధ్వంసకాండను వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆదివారం ఖండించారు. చంద్రబాబు రోడ్డుషోకు పుంగనూరులో ఎలాంటి అనుమతులు లేకపోయినా ముందే రచించిన ప్లాన్ మేరకు టీడీపీ గూండాలు, రౌడీలతో వెళ్లి విధ్వంసానికి పాల్పడ్డారని ఆరోపించారు. శాంతిభద్రతలను పరిరక్షించే పోలీసులపై కూడా రాళ్లు రువ్వి, వారిపైనే నిందలు వేసే స్థితికి టీడీపీ నేతలు దిగడం సిగ్గుచేటని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నేరుగా ఎదుర్కోలేక ఇటువంటి నీచ రాజకీయాలకు చంద్రబాబు తెరలేపారని, వీటిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సచివాలయాల మండల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరావు, ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, తిమ్మన వెంకట నాంచారయ్య, పీఏసీఎస్ చైర్‌పర్సన్ బావిశెట్టి పూలేంద్రరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరోసారి గుణపాఠం తప్పదు..

నాగాయలంక: చంద్రబాబు అరాచక వ్యూహాలతో రాష్ట్రంలో అలజడి సృష్టిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు, ఏపీ స్టేట్ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది వెంకట నారాయణ (చిన్నారి), జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో విధి నిర్వహణలో ఉన్న పోలీసుపై కర్రలు, రాళ్లతో దాడులు చేయించి గాయపర్చడం, అరాచకం సృష్టించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు తోట సాయిబాబు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ మండల కన్వీనర్ చెన్ను రంగారావు, నాయకులు బీమా బాబూరావు, తానంకి వేణు, ఆకుతోట సుధీర్ కుమార్, చిట్టా బాలపాపారావు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుంది..

మోపిదేవి: ఓటమి భయంతో చంద్రబాబుకు మతి భ్రమించి వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. పుంగనూరులో జరిగిన విధ్వంసం, పోలీసులపై దాడిని తీవ్రంగా ఖండిస్తూ పోలీసులకు మద్దతుగా మోపిదేవిలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కొనసాగాలంటే చంద్రబాబు, టీడీపీ నాయకులపై చట్టపరంగా క్రిమినల్ కేసులు పెట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు, గ్రామ కన్వీనర్ కారుమూరి తాతయ్య, సచివాలయ మండల కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు ఆది రాంబాబు, తుటారం కృష్ణ, రెడ్రౌతు వెంకట రమణ, గరికిపాటి గోవిందరాజు పాల్గొన్నారు.

రెచ్చగొట్టడం చంద్రబాబు నైజం..

పెడన: పార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు చిత్తూరు జిల్లా పుంగనూరులో తన కార్యకర్తలను రెచ్చగొట్టి ప్రజలు, పోలీసులపై దాడులు చేయించడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ పెడన నాయకులు ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక విలేకరులతో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లికార్జునరావు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు కుట్రలు, కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా చంద్రబాబు తీరు మార్చుకోవాలని, లేకుంటే మరోసారి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో కౌన్సిలర్ శిరివెళ్ల జయేష్, నాయకులు ముత్యాల మురళి, కోడూరు శ్రీను, బొర్రా మహేష్, బొడ్డు శ్యామల, కోమట్ల అనిల్, చిన్నం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో వైఎస్సార్ సీపీ నిరసన ..

చల్లపల్లి: ప్రాజెక్టుల సందర్శన పేరుతో చంద్రబాబు ప్రతి సభలో కార్యకర్తలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు మోపిదేవి ద్వారకానాథ్ అన్నారు. స్థానిక ప్రధాన కూడలిలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి గొడవలు, ఘర్షణలు, గలాటాలు, అల్లర్లు రేపి విధ్వంసం సృష్టించాలనేదే చంద్రబాబు మాస్టర్ ప్లాన్ అని ధ్వజమెత్తారు. ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్‌షాద్ నజరానా, వక్కలగడ్డ సర్పంచ్ వల్లూరు ఉమా, పీఏసీఎస్ చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి వైఎస్ జగన్

పేర్ని కిట్టు


వృద్ధుడితో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తూ సంక్షేమ సారథిగా పేరొందారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 26వ డివిజన్‌లో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాల వారికి గత నాలుగేళ్లుగా అందుతున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ ముద్రించిన బుక్‌లెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. సంక్షేమ పథకాలతో అన్నివర్గాలను ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్పొరేటర్, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, మాజీ కౌన్సిలర్లు మాడపాటి వెంకటేశ్వరరావు, చిటికిన నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ధనికొండ శ్రీనివాసరావు, బడే భానుతేజ తదితరులు పాల్గొన్నారు.

సాగర తీరంలో మెరైన్ పోలీసుల గస్తీ



కోడూరు: హంసలదీవి సాగర తీరంలో పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు గస్తీ నిర్వహించారు. ఆదివారం సెలవు దినంతో పాటు స్నేహితుల దినోత్సవం కూడా కావడంతో పోలీసులు తీరం వెంట బందోబస్తు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి వచ్చి సందడి చేశారు. గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు కుటుంబ సమేతంగా వచ్చి సరదాగా గడిపారు. యువత తీరానికి పెద్దసంఖ్యలో తరలివచ్చి స్నేహితులతో కలిసి వివిధ రకాల ఆటలాడుతూ ఉత్సాహంగా గడిపారు. మెరైన్ సీఐ పవన్ కిషోర్ పర్యవేక్షణలో ఎస్ఐ జిలానీ, రైటర్ రెహ్మాన్ జానీ, సిబ్బంది గస్తీ నిర్వహించారు.

గిరిజనాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట


సమావేశంలో మాట్లాడుతున్న మద్దెల రామకృష్ణ

గుడివాడ టౌన్: గిరిజనుల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి పెద్ద పీట వేస్తున్నారని ఎస్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దెల రామకృష్ణ అన్నారు. స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని వంకదార కల్యాణ మండపంలో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ గుడివాడ శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గతంలో గిరిజన బిడ్డలు చదువుకు దూరమవ్వడం, ప్రభుత్వ పథకాలు చేరువకాక అట్టడుగు జీవితం జీవించేవారన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ట్రైబల్స్ అభ్యున్నతికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి బ్యాంకు రుణాలు అందిస్తూ అన్ని ప్రభుత్వ పథకాలు వారికి చేరేలా కృషిచేస్తుందన్నారు. ఈ సదవకాశాలను ట్రైబల్ బిడ్డలు వినియోగించుకుని ఉన్నత స్థితికి చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ శాఖ అధ్యక్షుడు శీలం దానయ్య, ప్రధాన కార్యదర్శి శీలం రాంబాబు, నాయకులు ఏడుకొండలు, వైఎస్సార్ సీపీ రూరల్ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, సీనియర్ నాయకులు గద్దె రాము, మురళి తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి


గుడివాడ టౌన్: ఉద్యోగుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తూ వాటిని పరిష్కరిస్తున్న ఏకైక ఉద్యోగ సంఘం ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ అని కృష్ణాజిల్లా అధ్యక్షుడు ఉల్లి కృష్ణ అన్నారు. స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో ఆదివారం గుడివాడ తాలూకా యూనిట్ ఎన్జీఓస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21, 22 తేదీల్లో అసోసియేషన్ 21వ రాష్ట్ర మహాసభ విజయవాడలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విజయవాడలో జరిగే మహాసభల ప్రణాళికపై చర్చించి ఎన్జీఓలను సమాయత్తపర్చడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. తొలుత మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఎన్జీఓలు పాల్గొంటారని, ప్రతి ఒక్కరూ ఈ మహాసభలు విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మున్సిపల్ కమిషనర్ వి. మురళీకృష్ణ, గుడివాడ రూరల్ ఎంపీపీ గద్దె పుష్పరాణి, నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ నిర్వాహకులపై దాడి


పోలీస్ అవుట్ పోస్టులో బాధితులు

మోపిదేవి: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన వాహనాల పార్కింగ్ నిర్వాహకులపై ఆదివారం దాడి జరిగింది. ఎస్ఐ పద్మ తెలిపిన వివరాల ప్రకారం.. సింహాద్రి రాజా రమేష్ దేవస్థానంలో పార్కింగ్ నిర్వహిస్తున్నాడు. ఉయ్యూరు మండలం వీరవల్లి మొఖసా గ్రామానికి చెందిన కుక్కల వెంకటరత్నం ఆదివారం కారు పార్కింగ్ చేశాడు. తిరిగి కారు తీసుకుని వెళుతుండగా పార్కింగ్ ఫీజు చెల్లించాలని నిర్వాహకుడు రాజారమేష్ అడిగాడు. కారుకు ముందస్తుగా టోకెన్ తీసుకోలేదు.. బయటకు వెళ్లే సమయంలో రుసుం అడగడం ఏమిటని ప్రశ్నించాడు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య వాదోపవాదాలు జరిగి ఘర్షణకు దారితీసింది. చేతిలోని కీ చెయిన్‌తో వెంకటరత్నం బలంగా పొడవడంతో రాజా రమేష్‌కు గాయాలయ్యాయి. ఈ వివాదాన్ని ఆపేందుకు అడ్డువెళ్లిన సింహాద్రి పవన్, మదాల మహేష్‌లపై కూడా వెంకటరత్నం దాడి చేయడంతో వారు కూడా గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలి


పామర్రులో మాట్లాడుతున్న పామర్రు ప్రాజెక్టు సీడీపీఓ భానుశ్రీ

పామర్రు: బిడ్డ పుట్టిన అరగంటలోపు ముర్రుపాలు పట్టించాలని ఐసీడీఎస్ పామర్రు ప్రాజెక్టు సీడీపీఓ వి. భానుశ్రీ అన్నారు. స్థానిక సాయినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమన్నారు. పుట్టిన అరగంటలోపు ముర్రుపాలు తాగించడం వల్ల శిశువుకు అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. తల్లిపాలలో ఉండే పోషకాలు, బిడ్డ ఎదుగుదలపై చూపే ప్రభావం గురించి అవగాహన కల్పించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏటా ఆగస్టు 7వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలను నిర్వహిస్తోందని తెలిపారు. బిడ్డకు పాలివ్వడం ద్వారా తల్లికీ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. బిడ్డకు పాలిచ్చే తల్లులకు బ్రెస్ట్ క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువని తెలిపారు. రక్త హీనత, ఎముకల బలహీనత వంటి జబ్బులు రావన్నారు. బిడ్డకు పాలివ్వడం ద్వారా ప్రసవం అనంతరం అయ్యే రక్తస్రావం అదుపులో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కుమార్తె అదృశ్యంపై తల్లి ఫిర్యాదు

కోడూరు: తన కుమార్తె కనిపించడం లేదని తల్లి కోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పిట్టల్లంక గ్రామానికి చెందిన మారుబోయిన సునీతకు బడేవారిపాలెం గ్రామానికి చెందిన భాగ్యరామ్‌తో తొమ్మిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. ఈ నెల 1వ తేదీన సునీతకు ఆమె తల్లి దావు రాఘవమ్మ ఫోన్ చేసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఫోన్లు చేస్తున్నా సునీత స్పందించలేదు. రాత్రి 11 గంటల సమయంలో భాగ్యరామ్ అత్త రాఘవమ్మకు ఫోన్ చేసి మీ కుమార్తె ఇంట్లో నుంచి వెళ్లిపోయింది అని చెప్పాడు. దీంతో బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద విచారణ చేశారు. అయినా సునీత ఆచూకీ లభించలేదు. సునీత తల్లి రాఘవమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మురుగు తొలగింపు

మండవల్లి : మండవల్లి వెలమపేట రామాలయం ఎదురుగా ఉన్న సీసీ రోడ్డుపై ఇటీవల హైవే విస్తరణ పనుల సందర్భంగా నిలిచిన మురుగునీటి వల్ల వెలమపేట వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో సర్పంచి మెండా ఝాన్సీ సూచన మేరకు సిబ్బంది రోడ్డుపై నిలిచిన నీటిని తొలగించి బ్లీచింగ్ చల్లారు. రాకపోకలకు వెసులుబాటు కల్పించారు.

పారిశుద్ధ్య కార్మికులకు సాయం

కైకలూరు (కలిదిండి) : స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1992–93 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు పారిశుద్ధ్య కార్మిక కుటుంబాలకు నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. ముందుగా స్నేహితులందరూ ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ మసిముక్కు మారుతీప్రసన్న హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు పి.రవికుమార్, బి.భూషారావు, ఎం.సోమేశ్వరరావు, జి.సుబ్రహ్మణ్యం, కె.రాజాగుప్తా, పి.లలిత ప్రసాద్, వై.ఆరోగ్య జీవరత్నం, ఎస్.కృష్ణ, వి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

భైరవపట్నంలో శాంతి ర్యాలీ

మండవల్లి: మణిపూర్‌లో జరిగిన దాడులకు నిరసనగా మండలంలోని భైరవపట్నంలో విచారణకర్త ఫాదర్ కిషోర్ ఆధ్వర్యంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ దాడులను వారు తీవ్రంగా ఖండించారు. ఫాదర్ కిషోర్ మాట్లాడుతూ మణిపూర్‌లో దాడులు అమానుషమన్నారు. కార్యక్రమంలో మెండా సురేష్, భైరవపట్నం గ్రామస్తులు, ఉపదేశకులు పాల్గొన్నారు.